# ౩౩. వేలుపు

నూరు రూపాయల నోటు మరో మాటు చూసి పర్సులో పెట్టుకోబోతున్న శివయ్య ఒక్కసారి నీరు విడిచిపోయాడు.

ఎదురుగా రామారావు నిలబడ్డాడు.

అతని కళ్లల్లో నిప్పులు రేగుతున్నాయి.

"శివయ్యా! ఆ నోటు ఇలాతే"!రామారావు కోపంగా అన్నాడు.

శివయ్య నోటును గట్టిగా పట్టుకున్నాడు.

"ఇయ్యి ముందు."

శివయ్య దీనంగా రామారావు ముఖంలోకి చూశాడు.

"నన్ను బతిమాలి, లైసెన్సు తయారు చేయించడానికి కారణమిదేనా? వారం రోజులలో ఇవ్వవలసిన దానిని రెండు రోజులలో పూర్తి చేయించావు"

శివయ్య జవాబు చెప్పలేదు. చూపులు కిందకు తిప్పుకున్నాడు.

"ఆఫీసులో ఎవరూ లేరనుకున్నావు. ఉన్న చౌకీదారుని బజారుకి పంపించావు. నేను నీకన్న ముందు వచ్చాను. మూలనున్న బీరువాలోని ఫైళ్ళు చూస్తున్న సంగతి కూడా నువ్వు గమనించలేదు."

శివయ్య ముఖం ఉదాసీనంగా ఉంది. పిడికిలి బిగించి, నోటు బయటికి పోకుండా పట్టుకున్నాడు.

" నీకొచ్చిన వయసు ఇంకెవరికొచ్చింది ?  ఈ ఎంగిలి కూటికెందుకు కక్కుర్తి పడుతున్నావు ? "

రామారావు కళ్లలోకి చూస్తూ, నోటు జేబులో తొందరగా పెట్టుకొని గట్టిగా నొక్కి పట్టుకున్నాడు శివయ్య.

"శివయ్యా! ఇది లంచం సొమ్ము. కష్టార్జితం కాదు. పిల్లలు కలవాడివి. ఇటువంటి దానినిముట్టుకోడం కన్న పాపమికేముంది?"

శివయ్య పెదవులమీద కాంతిలేని చిరునవ్వొకటి కదిలింది.

"అవును రామం! పిల్లలు కలవాడిని కాబట్టే ఈపని"

"చెప్పడానికి సిగ్గు కూడాలేదా! ఇంతకన్న పెళ్లాం పిల్లలతో ముష్టెత్తుకోడం మంచిది".

"అవును. ఒంటరిగాడివి. సంసారాన్ని పోషించడంలో కష్టసుఖాలు నీకేం తెలుసు?"

" ఈ డబ్బు న్యాయంగా ఆర్జించినదేనా? సమాధానం చెప్పు."

" ఈ డబ్బు వెంకట నారాయణగారు సంతోషంతో యిచ్చినది."

"ఎవరికి? ప్రభుత్వానికా?"

"కాదు. చేయించినవాడికి"

"చూడు శివయ్యా! ఈ పనికిమాలిన మాటలు కట్టిపెట్టు. నోటు యిలా తే!"

"బాబ్బాబూ! ఈ ఒక్కసారికి ఊరుకో! ఇక మీద పుచ్చుకోనులే. ప్రమాణం చేస్తాను.'

"ఎన్నిసార్లు చెయ్యలేదు. వాటిమీద నాకు నమ్మకం పోయింది. నోటు యిచ్చీ. దానిని ఆ వెంకటనారాయణ గారికి క్షమాపణలతో తిరిగి పంపుతాను."

"వద్దు!"

రామారావు కోపం పట్టలేకపోయాడు. బలంగా శివయ్య చేతినిలాగి, జేబులో నున్న నోటును తీశాడు. పెనుగులాటలో జేబు చిరిగిపోయింది.

శివయ్య నిస్సహాయంగా రామారావు కళ్ళలోకి చూశాడు. పోరాటంలో ఓడిపోయాడు.

"ఉన్న ఈ ఒక్క చొక్కా చిరిగిపోయింది తమ్ముడూ! ఆదివారాలలో ఉతుక్కొని వారమంతా వాడుతున్నాను."

రామారావు ముఖం వివర్ణమయింది. చొక్కా జేబు దగ్గిర బాగా చిరిగిపోయింది. తొందరపాటుకు అతను పెదవి కరుచుకున్నాడు.

"వెంకటనారాయణగారు ఏపదో యిస్తారని నీ కాళ్లు పట్టుకొని ఈ పనిచేశాను. మంచో చెడో పదిరూపాయల దగ్గిర వందరూపాయలు వస్తే అదృష్టం పండిందనుకున్నాను. పగటి కలలు కన్నాను. పెళ్లానికో పిల్లలకో- పాపం! బొత్తిగా వాళ్లు చింకివాటితోనే కాలం గడుపుతున్నారు. - బట్టలేనా కొందామను కున్నాను."

రామారావు, చేతిలోనున్న నోటు మడతలు విప్పి సరిచేస్తూ చూపులు కిందకు దించుకున్నాడు.

"బట్టలమాటకేం- నాలుగురోజులయి రాత్రిపూట పస్తులుంటున్నాము. జీతాలు దొరికేవరకేనా రెండు పూటలూ తిండి దొరుకుతుందని సంతోషించాను."

రామారావు వినలేకపోతున్నాడు. హృదయంలోంచి మెల్లగా, బాధతో బయటపడుతున్న ఆమాటలకతడు తట్టుకోలేకపోతున్నాడు.

"తమ్ముడూ! నిన్ను నిందించడంవలన ప్రయోజనమేముంది. ఎన్నాళ్లబట్టో, మా ఆవిడకు, పిల్లలకు ఆశలు కల్పిస్తూ వచ్చాను."

జీవంలేని చిరునవ్వు అతని పెదవులమీద మళ్లాదొర్లింది.

"వాళ్లకు తెలుసు, నామాటలలో నిజం లేదని- ఈ రోజు ....."

రామారావు మరి వినలేకపోయాడు.

"బ్రదర్! క్షమించు. ఏదో ఉద్రేకంలో.."

"లేదు తమ్ముడూ! నువ్వేం బాధపడకు. ఆదర్శంకోసం నీ జీవితం అంకితమయింది. నీవంటివారు దేశానికి కావాలి."

"శివయ్యా!"

శివయ్య రామారావు ముఖంలో ఒకకొత్త వెలుగు చూశాడు.

రామారావు జేబులోనున్న పర్సుతీశాడు..

"నిన్ననే బాంకునుండి డబ్బుతీశాను. ఏదోకొందామనుకున్నాను. దానిని తరువాత కొనుక్కోవచ్చు. ప్రస్తుతానికి ఈ ఏభై తీసుకో."

"లేదులే! తీసుకో!" రామారావు ఆనోట్లు చిరిగిన శివయ్య జేబులో పెట్టాడు. అవి జారిపోతుంటే, ఒక కవరులో పెట్టి శివయ్య చేతికిచ్చాడు.

శివయ్య ఏమీ జవాబు చెప్పలేకపోయాడు. ఆ కవరు రెండు మూడు సార్లు కళ్లకద్దుకున్నాడు. జాగ్రత్తగా డ్రాయరులో వెనక్కిపెట్టి, కాగితాలు ముందు పడవేసుకొని కూర్చున్నాడు.

రామారావు తన సీటుకు వెళ్లి కూర్చున్నాడు. కిటికీలోంచి చూశాడు. శైలజ గొడుగుముడిచి, ఆఫీసుమెట్లు ఎక్కుతున్నది. పెదవి విరిచి నవ్వుకున్నాడు.

"చాల వేగమే వచ్చావే!.." లోపలికి వస్తున్న శైలజను పలకరించి, పక్కనున్న కుర్చీ చూపించాడు రామారావు.

శైలజ కుర్చీలో కూర్చొని, వానిటీబాగ్‌లోంచి రుమాలు తీసి ముఖంమీద చెమటను ఒత్తుకుంది. లవండరు వాసనలు కదిలి రామారావు వేపు ప్రయాణం చేశాయి.

"రేపు సెలవు పెడుతున్నాను. అందుచేత పని కొంత వేగంగా పూర్తి చేయాలని వచ్చాను. దొరగారు కూడా వేగం వస్తానన్నారు. తొందరలో మరచిపోతానో ఏమో!- రేపు సాయంకాలం రాక తప్పదుసుమా!... వేయి కళ్లతో నీకోసం ఎదురుచూస్తాను" అంది శైలజ.

ఇంతలో బంట్రోతు ఫైళ్లదస్త్రం తెచ్చి మేనేజరు గారి టేబిలుమీద పెట్టాడు.

"ఈపెద్ద మనిషి వస్తే వేళాకోళం చేస్తాడు. వెళ్లిపోతాను." అంది శైలజ.

"ఇంకెంతకాలం? ఒక్కనెల్లాళ్లు అటుతరువాత మనని వీళ్లేం చెయ్యగలరు?"

శైలజ నిలబడి అతని కన్నులలోకి చూసి చిన్నగా నవ్వింది, సన్నజాజులు కదలినట్లయింది.

"ఈ నెల యుగాలుగా తోస్తుంది." అంది శైలజ. తరువాత తొందరగా వెళ్లిపోయింది. మేనేజరు లోపలికి వచ్చాడు.

బయట పోలీసువాను వచ్చి నిలబడింది. తొందరగా జవానులు సర్దుకొని చుట్టూ కాపలా కాశారు. పేముబెత్తం విలాసంగా తిప్పుతూ నాయుడుగారు లోపలికి వచ్చారు.

మేనేజరు లేచి నమస్కారం చేశాడు, ఇనస్పెక్టరు నాయుడుగారికి.

"సెర్చివారంట్, పంతులుగారు." నాలుగువేపులు చూస్తూ అన్నారు ఇనస్పెక్టరుగారు.

"ఏమయింది సార్?" మేనేజరు ప్రశ్నించాడు.

"ఎవరో శివయ్యట!"

అందరి దృష్టులు శివయ్యమీదికి పోయాయి.

"అతను మా డిస్పాచ్‌క్లార్కు సార్!"

"లైసెన్సులిచ్చే మీ గుమస్తాకి ఒక గంట కిందనే మా మనిషి డబ్బిచ్చిపోయాడు." వెంకటనారాయణగారి తుపాకీ లైసెన్సు రెండు రోజులలో యిప్పించినందుకు వందరూపాయలు బహుమతి."

"మా లైసెన్స్ క్లార్కు వేరుసార్!"

రామారావు శివయ్య ముఖంలోకి చూశాడు.

శుష్కించిన అతని ముఖంలో ఒక్క నెత్తురు చుక్క కూడా లేకుండా ఇగిరిపోయింది. శరీరమంతా చెమటపట్టి అతను భూమికి కుంగుతున్నట్లు కనిపించాడు. మనిషి కంపిస్తున్నాడు.

పరిస్థితి విషమించింది. దారులన్నీ మూసుకున్నాయి.

"నాయుడుగారు! నమస్కారం!" మేనేజరు టేబిలు దగ్గిరికి వచ్చి రామారావు నిలబడ్డాడు. ఆయన నమస్కారం అందుకున్నారు.

" నేనే లైసెన్సుక్లార్కు రామారావుని"

"గుడ్!"

"ఆ శివయ్యకేమీ తెలీదు. నేను లేనప్పుడు ఎవరో నాకిమ్మని యిచ్చారని,నోటు నాకు అందజేశాడు."

"చాల బాగుంది."

"మీరు బహూమతిగా పంపిన వందరూపాయలు అందుకున్నాను. ఈ సంతకం, ఈ నోటునంబరు సరిపోయాయో లేదోచూసుకోండి." రామారావు పర్సులో జాగ్రత్తగా మడతపెట్టి దాచిన నూరురూపాయలనోటు పైకి తీశాడు.

నాయుడుగారు డైరీ తీసి నోటు నంబరు మరోసారి సరిపెట్టుకున్నారు. అతని సంతకం కూడా ఒకమూలను ఉండనే ఉంది.

"పంతులుగారు! మీ రామారావుని అరెస్టు చేస్తున్నాము."

'ఆఫీసుకి కలెక్టరు గారు వచ్చారు. వారి అనుమతి తీసుకొని ఈ పనిచేస్తే మంచిదేమో!'

" అవును. వారికి ఈ మనిషిని ఓసారి చూపించాలి."

సాదాదుస్తులలో ఉన్న జవాను బేడీలు తీశాడు.

"నాయుడుగారు! ఈ పని మీ వానులో అతను కూర్చున్న తరువాత చేస్తే బాగుంటుంది. మా ఎదుటే ఇది జరిగితే కష్టంగా ఉంటుంది." అన్నాడు మేనేజరు.

"పంతులుగారు! తెలియాలనే మా ఉద్దేశం. ఈ గౌరవం అందరికీ లభించదు గదా!"

రామారావు చేతులు చాచాడు. బేడీలు వేసిన తరువాత అతనిని కలెక్టరు దగ్గిరకి తీసుకెళ్లారు.

మేనేజరు ఫైళ్లు పక్కకుబెట్టి లేచి నిలబడ్డాడు. అప్పుడే వచ్చిన విశ్వనాథం, హాజరీ సంతకం పెడుతూ కసిగా అన్నాడు.

"మేనేజరు గారు! ఇప్పుడు తెలిసిందా, ఎవరెటువంటి వాళ్లో? రెడ్‌హాండెడ్‌గా దొరికిన వాళ్లకి కనీసం మూడేళ్లేనా ముచ్చటగా ఖైదుశిక్ష. అటుపిమ్మట గవర్నమెంటు నౌకరీ మరి దొరకదు."

శివయ్య శరీరం కంపిస్తున్నది. ఎంతఘోరం! ఎంత ఘోరం!! అతని కళ్లకి బిచ్చమెత్తుకుంటున్న పెళ్లాం పిల్లల ముఖాలు కనిపించినట్టయింది.

" ఈ దెబ్బ నీకు తగలవలసింది" అన్నాడు మేనేజరు, పాతపిల్లి విశ్వనాథాన్ని ఉద్దేశిస్తూ.

ఆ మాట విని శివయ్య తుళ్లిపడ్డాడు.

"అదృష్టవంతుడివి. కొత్తగా నీ సీటుకి వెళ్లినవాడికి నీ పాపం చుట్టుకుంది." అన్నాడు మేనేజరు విశ్వనాథంతో.

శివయ్య గుండెమీద చెయ్యివేసుకున్నాడు. వేగంగా కొట్టుకుంటున్న అతని గుండె దారిపడుతున్నది.

" ఆదర్శాలు వర్ణించే మహానుభావుల నిజస్వరూపాలు చూద్దాం రండి. అందరినీ పిలిచాడు విశ్వనాథం.

మేనేజరుతో పాటు శివయ్య, విశ్వనాథం, మరో యిద్దరు గుమస్తాలు కలెక్టరుగారి గదివేపు నడిచారు.

ఆ సరికే రామారావును లోపలికి తీసుకెళ్లారు. డిక్టేషను ఆపి, శైలజ వెలుపలికి వచ్చింది.

" రేపు బర్తుడే పార్టీకి, వచ్చే నెల వివాహమంగళానికి రామారావుని వదిలిపెట్టమను." విశ్వనాథం స్టెనో శైలజతో అన్నాడు.

శైలజ ముఖంలో కోపం ఎఱ్ఱబడింది.

"పుట్టినరోజు కానుక కొనడానికి పుచ్చుకున్నట్లు ఉంది. పాపం!" అన్నాడు విశ్వనాథం, మళ్లా ఆమెనే అల్లరిపెడుతూ.

"షటప్!"తన్నినంతచేసి, శైలజ తన గదిలోకి వెళ్లిపోయింది.

కొద్దిసేపటిలో రామారావుని వెంటబెట్టుకొని ఇనస్పెక్టరుగారు పైకి వచ్చారు.

అందరి ముఖాలలో విచారం నెలకొంది.

రామారావు ముఖం మాత్రం చాల ప్రశాంతంగా ఉంది.

వాన్‌లోకి ఎక్కుతున్న రామారావు అందరికీ కనపడ్డా, ధారలుగా కారుతున్న కన్నీళ్లలో శివయ్య కతను కనపడలేదు.

శివయ్య తన వయసు సంగతి మరచిపోయి రెండు చేతులూ జోడించి నమస్కరించాడు తన వేలుపుకి.

(యువమాస పత్రిక)